"అవును"

"అయామ్ సారీ! నేను రాను"

"కానీ జ్యోతిష్యం ప్రకారం మీరు రాననకూడదు"

"నాకు జ్యోతిష్యం మీద నమ్మకం లేదు. క్రియేట్ చేసిన వామనశాస్త్రి అనే జ్యోతిష్య సామ్రాట్ ఎవరూ ఈ భూప్రపంచంలో లేరని కూడా నాకు తెలుసు."

సురేష్ బయటకు నడిచాడు.

"మిస్టర్........."

వెనక్కు తిరిగి చూశాడు. ఆమె వెనకే వస్తోంది.

"పదండి కాఫీ తాగుదాం"

* * * *

"మీ పేరేమిటి?" అడిగిందామె హోటల్ ఫామిలీ రూమ్‌లో కాఫీ తాగుతూ.

"అసలు పేరు సురేష్ , నిక్‌నేమ్ చాక్‌పీస్"

"అయిదో క్లాస్ చదువుతుండగా మా సోషల్ స్టడీస్ మేడమ్ చాక్‌పీస్‌లు కాజేశాను. అందుకని ఆ పేరు సెటిలయిపోయింది"

"నా పేరు ప్రత్యూష"

"నిక్‌నేమ్?"

"కొంగ" నవ్వాపుకుంటూ చెప్పింది.

"ఎందుకనో నాకు తెలుసు"

"చెప్పండి"

"పొడుగు కాళ్ళేసుకుని కొంగలా నడిచి వుంటారు"

"కాదు -మా స్కూల్ దగ్గరున్న చెరువులో కొంగ నిలబడి వుంటే పట్టుకోటానికని వెళ్ళి బురదలో కూరుకుపోయాను. చిన్నప్పటినుంచి ఎడ్వెంచర్స్ అంటే ఇష్టం నాకు"

"బురదలో కూరుకుపోయి బేరుమని ఏడవటం ఎడ్వెంచరా?"

"నేనేం ఏడవలేదు"

కాఫీ తాగడం పూర్తయింది. బేరర్ బిల్ ప్లేట్లో పెట్టి వారి ముందుంచాడు.

"మీరిక్కడే వుండండి. హోటల్ వెనక వైపు నుంచి దారేమైనా వుందేమో చూస్తాను."

"ఎందుకు?"

"బిల్లు కట్టకుండా సింహద్వారం నుంచి వెళ్ళటం బావుండదు కదా"

"అందాల సాహసవంతులు బిల్లు కట్టలేరా?" తన పర్స్‌లోంచి డబ్బు తీసి ప్లేట్లో వుంచుతూ అందామె.

“డబ్బుల్లేకేగా వెనుకదార్లు వెతికి సాహసాలు చేయటం”

ఇద్దరూ బయటికొచ్చారు.

“ఇంక మనం ఏదైనా గార్డెన్ లోకెళ్ళి పాటలు పాడదామా?”

“అదేమిటి?”

“మన సినిమాల్లో అలాగే జరుగుతుంది కదా! హీరో, హీరోయినూ కలుసుకుని రెండు డైలాగులు మాట్లాడుకోగానే పాటలోకి, డాన్స్‌లోకి దిగిపోతారు”.

లైబ్రరీ దగ్గరకొచ్చారు మళ్ళీ.

“నాకు మీతో ఇలా మాట్లాడుతూంటే బావుంటుంది”

“నాకు మాట్లాడకుండా వుంటే బావుంటుంది”

ఆమె అతని వైపు అనుమానంగా చూసింది.

“ సీ యూ టుమారో”

“రేపు బ్యాంక్ లో ఇంటర్వ్యూ”

“సీ యూ డే ఆఫ్టర్ ”

“ఎల్లుండి మాఇంట్లో వ్యూ”

“అంటే?”

“మా గాళ్ ఫ్రెండ్ తాలుకూ వ్యూ”

ఆమె నవ్వేసింది “సిల్లీ”

“చూసేవారికి”

ఆమె వెళ్ళిపోయింది.

టైమ్ చూసుకున్నాడు సురేష్ . పదకొండు. బస్‌స్టాండ్‌కి నడిచాడు.

* * *

నటాషా నిద్రకళ్ళతో హోటల్ గది తలుపు తెరిచింది.

“ఓ ! నువ్వా ” అంది కళ్ళు నులుముకుంటూ.

“మరోసారి వస్తాను. లోపలేమో అభ్యంతరకర దృశ్యాలున్నాయి కదా!”

ఆమె నిద్ర మత్తు వదిలిపోయింది. వెనక్కు తిరిగి చూసి “అభ్యంతరకర దృశ్యాలేమున్నాయ్?” అంది ఆశ్చర్యంగా.

“మరి నన్ను లోపలకు రానీయకపోతే.”

ఆమె అతని చేయి పట్టుకుని విసురుగా లోపలకు లాగి తలుపేసింది. ఆ ఫోర్స్‌కి సోఫాలోపడ్డాడు. కర్టెన్ వెనుక ఇంకో క్యాబరే అమ్మాయి నిద్ర పోతోంది.

బాత్ రూలోకెళ్ళి ముఖం కడుక్కుని వచ్చి ఎదురుగ్గా కూర్చుంది.

“రాత్రంతా మన స్కూల్ రోజులే గుర్తుకు వచ్చాయి. నిద్రపట్ట లేదు” అంది నవ్వుతూ ఆమె కళ్ళల్లోకి చూస్తూంటే నిజంగా ఆనాటి కళ్ళే గుర్తుకొస్తున్నాయి.

“మళ్ళీ ఈ జన్మలో నిన్ను చూడగలననుకోలేదు” అన్నాడు సురేష్ .

“నేనూ అంతే!”

“ఒకవేళ చూసినా, నీ ఫోటో ఏ పేపర్లోనో నువ్వేదో ఘనకార్యం చేసినప్పుడు కనబడుతుందని అనుకున్నాను.”

నటాషా బెల్ నొక్కింది. మరుక్షణం బోయ్ వచ్చాడు.

“రెండు కాఫీ తీసుకురా.”

“మా ఫాదర్‌కి పెరాలిసిస్ వచ్చింది. దాంతో ఉద్యోగం పోయింది. నా కాలేజ్ ఎడ్యుకేషన్ ఆపి జాబ్ కోసం వెతకాల్సి వచ్చింది” ఎనిమిదేళ్ళ జీవిత చరిత్రను రెండు మాటల్లో చెప్పింది.

“నీ సంగతేమిటి? ఎక్కడ జాబ్ చేస్తున్నావు?”

“ఒకమ్మాయి దగ్గర”

“అమ్మాయి దగ్గరేం జాబ్”

“అబ్బాయి జాబ్”

నటాషా నవ్వింది. అతని చేతిని తన చేతిలోకి తీసుకుని నిమిరింది,

“ఇంకా పిచ్చి మాటలు మానలేదు కదూ? అప్పుడు యింతే.....ఎప్పుడూ గుర్తుకొస్తూంటాయ్..”

సురేష్ నవ్వాడు “వట్టి మాటలేనా? మిగతావన్నీ గుర్తుకొస్తాయా?”

నటాషా అతని చేతిని గుండెలకు హత్తుకుంది “ఎవ్విరిథింగ్”

సురేష్ లేచి ఆమె పెదాలను సుతారంగా ముద్దుపెట్టుకుని మళ్ళీ తన స్థానంలో కూర్చున్నాడు.

“మీ పిన్ని ఒకామె వుండాలి కదా! ఎలా వుందామె? ఆమె అంటే నాకెంతో ఇష్టంగా వుండేది”.

“ఆమెను లేవదీసుకుపోయిన స్వాములవారి క్కూడా ఎంతో ఇష్టం మా పిన్నంటే”.

నటాషా ఉలిక్కిపడింది. “నిజంగానా?”

“ఎస్, అప్పుడే మీరు బదిలీ అయి ఆ వూర్నుంచి వెళ్ళిన కొద్దిరోజులకే.”

కర్టెన్ వెనుక మంచం మీద పడుకున్న క్యాబరే అమ్మాయి పక్కకు తిరిగి తలగడను కౌగిలించుకుని పడుకుంది మళ్ళీ.

“మే అయ్ హెల్ప్ యు మేడమ్” అన్నాడు సురేష్ ఆమెవంక చూస్తూ.

నటాషా అతని  తొడమీద గిల్లింది.

"తనకి హెల్ప్ చేసే వలంటీర్లు చాలా మంది వున్నారులే"

"మరి నీ సంగతేమిటి ? హౌ మెనీ వలంటీర్స్".

"మెనీ"

"ఎవరయినా విజయం సాధించారా?"

"పెళ్ళి అనేప్పటికి పారిపోతున్నారు"

"వాటెబౌట్ చమన్ లాల్?"

"చమన్‌లాల్ కాకపోతే అగర్ వాల్.  అగర్‌వాల్  కాకపోతే చెట్టియార్, ఎవరోకరు-మన సినిమాల్లో ఈ పేర్లేగా. డ్యాన్సర్‌ని వదిలి పెట్టకుండా వెంబడి పడుతుంటారు".

"అలాంటి వాళ్ళు కొంతమంది  వున్నారు గానీ ఆల్ మనీ ట్రాన్సాక్షన్స్!  అయ్ డోంట్  లైకిట్."

"ఆల్‌రైట్ అయితే నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను"

"నీ కింకా పెళ్ళవలేదా?"

"అఫీషియల్‌గా అవలేదు.  తులసి అనే ఆవిడ నన్ను వుంచుకుంది"

నటాషాతోపాటు బెడ్  మీద నిద్రపోతున్న అమ్మాయి కూడా నవ్వేసింది.

"మీరా అమ్మాయిని చేసుకుంటారా?"

"ఇది ట్రయల్ పిరీడ్! నేను ఉపయోగపడతాననుకుంటే పెళ్ళి  చేసుకుంటుంది. లేకపోతే వాపస్."

"మరి నన్నెలా చేసుకుంటావ్"

"మామూలుగానే వన్ టూ త్రీ మారేజ్."

నటాషా తుళ్ళి  తుళ్ళి నవ్వసాగింది.  ఒక్కసారి చిన్నప్పటి రోజుల్లోకి విసిరివేయబడింది.

ఏడో క్లాసా?  ఎనిమిదా?  ఏమో గుర్తులేదు.   సరుకుతోటల్లో ఆడుకునే టప్పుడు.

వన్ టూ త్రీ . ఎంత అద్భుతమయిన తమాషాలు?  ఎన్ని చిలిపిచేష్టలు .

"నీ కింకా అవన్నీ గుర్తున్నాయి కదూ?" అతికష్టం మీద నవ్వాపుకుంటూ అడిగింది.

"గుండెల్లో సిమెంట్ అయిపోయినయ్"

నటాషా లేచి తన బట్టలు తీసుకుని బాత్ రూమ్ వేపు నడిచింది.

"రెండు నిమిషాలు కూర్చో!"

సురేష్ కూడా లేచి ఆమె వెనుక బాత్ రూమ్‌లోకి నడవబోయాడు.

బాత్ రూమ్ డోర్‌కి అడ్డంగా  నిలబడిందామె.

"నువ్వెక్కడికి?"

“రెండు నిమిషాలు బాత్ రూమ్‌లో కూర్చోమన్నావ్ కదా?”

నటాషా ఓ చేత్తో టాప్ వాటర్ అందుకుని అతని ముఖం మీద చిలికి తలుపు మూసివేసింది. సురేష్ గది కిటికీ దగ్గరకు నడిచి కర్టెన్ పక్కకు లాగాడు.మండిపోతున్న ఎండ నగరమంతా అలుముకుపోయి తగలడుతున్నది .రెండో బెడ్ మీద యువతి తలగడతోపాటే మళ్ళీ అటు తిరిగి పడుకుంటూ కళ్ళు సగం తెరచి సురేష్‌ను చూసి నైట్ గౌను సర్దుకోబోయింది.

“అలాగే వుండనీయండి! చాలా అందంగా వున్నారు” అన్నాడు సురేష్ . ఆమె పూర్తిగా కళ్ళు తెరచి అతనిని చూసి నవ్వింది.

“నటాషా చాలా లక్కీ”

“ఎందుకు”

“మీ గురించి ఎప్పుడూ చెప్తూంటుంది. చిన్నప్పుడు మీరు చేసిన వన్నీ”

“మైగాడ్ అన్నీనా?”

“అవును ” అని అతని మొహంలోకి చూసి అర్థం చేసుకుని మళ్ళీ నవ్వేసిందామె

“వెల్! అన్నీ అంటే చాలా చెప్తుండేది. అవి కొన్ని మాత్రం తెలీదు. ఏదేమయిన చిన్నప్పుడు అంత క్లోజ్‌గా వున్న వాళ్ళు యిన్నేళ్ళ తరువాత కలుసుకోవటం చాలా థ్రిల్లింగ్‌గా వుంటుంది. నాక్కూడా చిన్నప్పుడు ఓ ఫ్రెండ్ వుండేవాడు. పేరు శ్రీకాంత్ . ఇద్దరం ఎంత క్లోజో చెప్పలేను. వాడు మళ్ళీ కనబడితే బాగుండునని ఎంతో ఆశగా వుంటుంది నాకు. కనబడితే ఎంతో హాపీగా గడపవచ్చు కదూ”

“చూడండి! ఇందాకటినుంచీ మీకు నిజం చెప్పాలా వద్దా అని పటాయిస్తున్నాను”

“ఏమిటది?” ఆశ్చర్యంగా అడిగిందామె.

“నేనే శ్రీకాంత్‌ని.”

ఆమె లేచి కూర్చుని మరీ నవ్వసాగింది.

“శ్రీకాంత్ కనబడితే హాపీగా గడుపుతానన్నారుగా. ఇంకా ప్రారంభించరే?”

“మీరు నిజంగా వండర్‌ఫుల్ కంపెనీ ” అంది నవ్వుతూ.

నటాషా బాత్రూమ్‌లోంచి బయటికొచ్చింది.

తెల్లని పాలరాయిలాంటి శరీరం మీద వైలట్ కలర్‌చీర.

కళ్ళకు మత్తు కలిగిస్తోంది కాంబినేషన్.

“ఏమిటి ? రాజ్యలక్ష్మి నిద్ర చెడగొట్టావా?” సురేష్‌ని అడిగిందామె.

రాజ్యలక్ష్మి నవ్వేయసాగింది మళ్ళీ “హిఈజ్ రియల్లీ క్రేజీ”

నటాషా డ్రస్సింగ్ టేబుల్ దగ్గర కూర్చుంది. రాజ్యలక్ష్మి పడుకునే ఫోన్ అందుకుంది.

“హలో రవీ! ఏమిటి? ఇప్పుడా? ఓ.కె ! నో ప్రాబ్లమ్. రడీ అవుతాను అరగంట

తర్వాత కారు పంపించు. ఓ.కె సీయూ."

నటాషా రడీ అయింది.

"వెళదామా?"

"ఓ"

ఇద్దరూ బయటికి నడిచారు.

తలుపు వేసేముందు రాజ్యలక్ష్మి వేపు చూశాడు సురేష్. బద్ధకంగా వళ్ళు విరుచుకుంటోందామె.

"విష్ యూ హేపీ రవి" అనేసి తలుపు మూసేశాడు.

ఆటోలో సినిమా హాల్‌కి చేరుకున్నారు.

"నైన్త్ క్లాస్ అయ్యాక ఎక్కడికి వెళ్ళిపోయావు?" అడిగింది నటాషా.

"చాలాచోట్లకు. కాకినాడ, విజయనగరం, విశాఖపట్నం, కర్నూల్, అనంతపురం సూర్యాపేట"

"ఎందుకలా?"

"బ్రతుకుతెరువు. నాన్న చనిపోయారు. అమ్మతో మావయ్య దగ్గరకూ, పిన్ని, దగ్గరకూ, పెద్దమ్మ దగ్గరకూ, ఎక్కడ ఎన్నాళ్ళు వుండాలనిపిస్తే అక్కడ అన్నాళ్ళు."

"ప్చ ! హారిబుల్ లైఫ్ కదూ?"

కొంతవరకూ ఇద్దరూ పూర్తిగా ఆ రోజుల్లోకెళ్ళి పోయారు.

"నీకు మార్కండేయులుగారు గుర్తున్నారా? క్రాఫ్ట్ టీచర్ ?" అడిగింది నటాషా.

"ఎలా మర్చిపోతాను? మనిద్దరినీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు కదా" నటాషా నవ్వేయసాగింది.

"ఒకటా రెండా- వారం రోజులు స్కూలు ఎగ్గొట్టేశాం. వెళితే పట్టుకుని హెడ్మాష్టరు దగ్గరకు లాక్కెళతారేమోనని"

"ఈ మధ్య ఆయన కనిపించారు వైజాగ్ బీచ్‌లో" చెప్పిందామె.

సురేష్ ఆశ్చర్యపోయాడు.

"నిన్ను గుర్తుపట్టారా?"

"కొంచెం కూడా గుర్తులేదాయనకు. ఆఖరికి ఆ రోజు మనల్ని పట్టుకున్న విషయం గుర్తు చేశాను."

"ఏమన్నారు?"

"అలా ఎంతో మందిని పట్టుకున్నాట్ట" ఇద్దరూ నవ్వేయసాగరు .

"ఆ తరువాతేమైంది ?" వెనుక సీట్లో కూర్చున్నతను అడిగాడు నెమ్మదిగా.

ఇద్దరూ ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చూశారు. ముసలాయన చిరునవ్వు నవ్వాడు.

"మరేం లేదు. నేను నిజంగా సినిమా చూడాలని వచ్చాను. తెరమీద సినిమా. సీట్ల మీద సినిమా కాదు"

"మా సినిమా ఇంకా ప్రారంభమవలేదు కదా?" అన్నాడు సురేష్ .

ముసలాయన మళ్ళీ నవ్వాడు "టైటిల్స్ అవుతున్నాయ్ కదా!"

"పద, ఆ కార్నర్ కెళ్ళి కూర్చుందాం " అంది నటాషా, ఇద్దరూ లేచి ఖాళీగా వున్న మరో మూల కూర్చున్నారు.

ఇంటర్వల్‌లో ఇద్దరు కూల్ డ్రింక్స్ తాగుతూంటే ముసలాయన పక్కనే నిలబడి సిగరెట్ తాగుతున్నాడు.

"మీరు క్రాఫ్ట్ టీచర్‌గా వర్క్ చేస్తున్నారు కదూ?" అడిగాడు సురేష్ .

"మీరు కూడా రెడ్ హ్యాండెడ్‌గా ఎవర్నయినా పట్టుకున్నారా?"

అతను నవ్వాడు. "సెవెరల్ టైమ్స్."

నటాషా నవ్వుతోంది. సినిమా అయ్యేలోపల బాల్యంలోకి , ప్రస్తుతంలోకి అనేక వందల సార్లు ప్రయాణం చేశారు.

"ఓ సారి తులసిని చూడాలని వుంది" అందామె హాల్లో నుంచి బయటికొస్తూ.

"వెల్‌కమ్"

"ఇప్పుడు కాదు. మరోసారి హైద్రాబాద్ వచ్చినప్పుడు"

"అంటే.......?"

"ఎల్లుండి బాంబే వెళ్ళిపోతున్నాను."

"ప్రైమ్మినిస్టర్ కంటే బిజీ షెడ్యూల్‌లాగుంది నీది."

ఇద్దరూ ఆటోలో కూర్చున్నారు.

"నన్ను హోటల్ దగ్గర డ్రాప్ చేసి వెళ్ళిపో"

"ఆటో చార్జ్ ఎవరిస్తారు?"

"నేనే " నవ్వుతూ అందామె.

"డార్క్ డెవిల్‌ని చూస్తే జాలేస్తుంది నాకు" అందామె.

"అవును. వాడెలా భరిస్తున్నాడో తెలీదు."

"తాగి "

"అయుండవచ్చు."

ఆటోవాడికి ఇరవై రూపాయల నోటు యిచ్చిందామె.

"సీ యూ"

ఆటోలో ఇల్లు చేరుకున్నాడు. గంగాభవాని అతను ఆటోలో నుంచి దిగటం ఆశ్చర్యంగా చూసింది.

తులసి కరాటే ప్రాక్టీస్ చేసుకుంటోంది. సురేష్ బట్టలు మార్చుకుని ఆమెకెదురుగా కూర్చుని నిశ్శబ్దంగా చూడసాగాడు. ఆమెకు కరాటే స్కూల్ ప్రారంభించాలని కోరిక. ఎన్నోసార్లు సురేష్‌తో చెప్పింది.

"ఎలా వుంది?" ఆపి ఒగరుస్తూ అడిగింది.

"రేప్ చేయాలనిపించేంత ఎట్రాక్టివ్‌గావుంది"

"ఈ లిప్‌స్టిక్ ఎక్కడి నుంచి వచ్చింది?"